# నిష్కృతి

అయిదేళ్ళప్పుడు గిరి, అద్భుతమైన తెలివైనవాడుగా చలామణీ అయ్యాడు. 'గిరి ఎంతో తెలివైనవాడు' అన్న ముక్క పంతులుగా రేడద్దేశంతో ప్రవచించినా అది మాత్రం గిరి కళ్ళల్లో భాసించిన ఓవిచిత్రమైన సన్నని వెలుగు వెన్నెలల ప్రభావం తోకూడుకున్నదని మాత్రం మనంబప్పు కోకతప్పదు. మనం ఒప్పుకున్నా ఒప్పుకోక పోయినా వాడితల్లి మాత్రం ఆవిషయం పూర్తిగా ఆకళింపు చేసుకుంది. ఆమె ఇక ఆగురువుగారు చెప్పినమాట వేదవాక్కులా హృదయంలో పదిలంచేసుకుంది. ఆమాటవిన్న తండ్రి పెదవులమీద కించిత్ నగవు పొడచూపి, వెనువెంటనే సోయగపు మిటారిలా ఎంతో సిగ్గుపడి తలుపు చాటుకు తరలి పోయింది. ఒకసారి అతను కొడుకువైపు చూచి 'ఫరవాలేదు' అనుకున్నాడు. ఈ ఫరవాలేదు అనుకోవడంలో ఏ ఉద్దేశం ఇమిడి ఉందో మనకు మాత్రం అంతుపట్టదు.

అయితే గిరి అలా ఏమీ అనుకోలేదు. ఆవేళ వాడికంతా హాయిగా ఉంది. తన చుట్టూ నిలచి ఉన్న ఆ పసి పిల్లల సుందర ముఖ భంగిమలూ, వారి రకరకాల దుస్తుల

అందాల తీరు తెన్నులూ, వారి జిలిబిపలుకుల చిలిపిచేష్టల ఆత్మీయతలు వాడ్ని ఎంతో ముగ్ధుణ్ణి చేశాయి.

గిరి బడిలో అల్లరిచేసేవాడు కాదు. అయితే ఇంటి దగ్గఱ అప్పుడప్పుడు అది కావాలి ఇదికావాలి అని మంకుపట్టు పట్టేవాడు. ఏదో చికాగ్గా ఉండి, వాళ్ళమ్మ ఒక్కటి తగల నిచ్చేది. దానితో వాడు ఇల్లెగిరిపోయేట్టు కేక పెట్టేవాడు కాదు. అతి తీక్షణంగా వాళ్ళమ్మ వైపుచూసి, బుగ్గలమీదికి ప్రాకుతూన్న కన్నీళ్లను తుడుచుకోకుండా అలాగే, 'నిన్నేం చేస్తానో చూడు...నన్ను కొడతా వేం...' అన్నట్టుగా మొగం పెట్టేవాడు. అప్పటి వాడిమొగాన్ని చూడగానేవాళ్ల మ్మకు భయం వేసేది. 'ఇల్లు తగులబెట్టేసేవాడిలా ఏమిటిరా అలా చూస్తావ్' అనబుద్ధేసేది. కాని అంత పసివాణ్ణి పట్టు కొని, అంతమాట అనడం మంచిదికాదని ఆమెకు తోచేది. 'మా బాబువుగాఁ నీకు రేపిస్తాగా' అనేది లాలింపుగా. కాని వాడు 'ఊహుఁ నాకిప్పుడే ఇయ్యి' అనేవాడు. వాడికంఠం అతి కరకుగాబింకంగా సాగి ఆతల్లిగుండెల్ని కలచివైచేది. 'వేలెడు లేడుఏమిటి వీడికీ పట్టు' అనుకునేది. దానితో ఆమెవాడ్ని బెది రించాలని, 'ఉండు మీనాన్నగారు రానియ్...చెప్తానునీపని' అనేది. వాడు, 'నాన్నగారితో చెప్తావేం ... చెప్పుఁ ... ఎలా చెప్తావో చూస్తాను...' అనేవాడు. ఒక అన్యాయం చేశావు; మరొక అన్యాయం ఎలా చేస్తావో చూస్తానుగా... అన్న బాధ వాడి కంఠంలో కంపించేది. అప్పుడు ఆమెకు కోపం

ఆగేది కాదు. 'ఏమిటిరా అన్నావ్... మళ్లీ వాగు...' అనేది; వాడివైపు ఎర్రగా చూసి కొట్టడాని కుద్యమించి నట్లుగా అడుగులు ముందుకు వేసి, చేయి ఊపుతూ. దీనితో గిరి, అక్కడనుంచి రాయిలా కదలకుండా, 'కొట్టుచూస్తాను' అనేవాడు. ఈమాటతో ఆమె పాపం పూర్తిగా నీరసించుక పోయేది. ఇంక ఏమిచేస్తే వాడు దారికి వస్తాడో తోచక, 'నీ కివ్వాళ అన్నం పెడతానేమో చూడు' అనేది. వెంటనే వాడు, 'ఎవడిక్కావాలి నీ అన్నం... అంటూ బయటకు గట్టిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయేవాడు. ఆవేళ అన్నం తినడానికి వచ్చేవాడు కాదు. ఆతల్లి ఎంతో బ్రతి మాలి, ఇంకెప్పుడూ కొట్టనని ఎన్నోసార్లు వాడికి నచ్చజెప్పి, బుజ్జగించి, వాడి హిరణ్యాక్షవరాలు తీర్చి ఇంటికి వాడ్ని తీసుకొచ్చేది. కాని వాడు ఇట్లా జయాన్ని సాధించినందు లకు ఏమాత్రం సంతోషించే వాడు కాదు. పైపెచ్చు వాడి గుండెలనిండా, ఏదో తెలియరాని పగ నన్నెందుకు కొట్టాలి నన్నెందుకు కొట్టాలి... అని బుసలు కొట్టేది. వాడిది మర చిపోడానికి కొన్ని రోజులు పట్టేది.

వాడితో మరోచిక్కు వచ్చేది. వాడికి తలంటి స్నానం చేయించడం బ్రహ్మ ప్రళయ మయ్యేది. నలుగు పెట్టుకోవడ మంటే వాడికి మహాచెడ్డరోత. వంటికి ఏదో పేడపులిమినట్లు వికారంగా మొగం పెట్టేవాడు. నలుగు పెట్టేప్పుడు ఆనలుగు

బిండి చల్లదనానికి వాడిలోని ప్రత్యణువు గగుర్పొడిచి ఒక ప్రత్యేకపు బింకాన్ని పొందేది. అది కొద్దిగా ఆరిన తరువాత వాడిశరీరాన్ని నలిపేప్పుడు మంటెత్తి 'అబ్బా' అనేవాడు. ఈ స్నానం చేయడమనే ఇబ్బంది, ఎంతలో తొలగి పోతుందా అని ఆతృత పడేవాడు.

వాడు స్నానం గోచీతోనే చేయవలసి వచ్చేది. వాడికి పాపము తువాలు చుట్టుకొని నీళ్లు పోసుకోవాలని పించేది. కాని ఏమిచేస్తాడు? వాళ్ళమ్మ గోచీయే పెట్టుకోమ నేది. ఎందుకనో నాన్నగారిలా తువాలు చుట్టుకొని, స్నానం చేస్తా నని వాళ్ళమ్మతో చెప్పలేక పోయేవాడు. ఇంకా అంత తాహతు రాలేదని అందుకోసం కొన్నాళ్లు ఓపిక పట్టాలని వాడి ఉద్దేశమో... ఏమో...

తలమీద కుంకుడుకాయల రసం వేసేప్పుడు అది చల్లగా శరీరాన్ని గడ్డ కట్టించేస్తుందా అన్నంతగా వణికి పోయి, 'చలే బాబూ'... అని బిగ్గఱగా అరచే వాడు. తల సరిగా రుద్దించు కోవడం సంగతి అటుంచి, రెండు చేతు లతోనూ గట్టిగా కళ్ళుమూసుకొని, ఆతలను క్రిందికి వంచేసే వాడు. వాడితల్లి, ఆజుత్తు పుచ్చుకొని తలపైకెత్తి గట్టిగా పామి రుద్దేది. తల్లి రుద్దినచోటల్లా వాడికి చాకుతో చెక్కే స్తున్నట్లు చురచురలాడి పోయేది. దానితో వాడికి కోపం ఆగేది కాదు. ఎంతో ఆవేశంతో, 'నాకొద్దీ నీళ్లు...' అని ఆకసం చీరుకపోయేట్టు అరచేవాడు. అంతతో ఆకోపం

ఆగక, ఒళ్లుమరచి, ఎర్రిగా ఆ తల్లివైపు చూసి ఆమెను కాల్చెయ్యబోయేవాడు. ఇంకేముంది! వాడి నెత్తిమీది కుంకుడు కాయల రసం చల్లగా వాడి కళ్ళల్లోకి పారేది. దానితో వాడి కళ్లు భగ్గున మండి పోయేవి. 'బాబోయ్' అంటూ వాడు స్నానంచేస్తూన్న ఆ దొడ్డిలో అటూ ఇటూ గంతులేస్తూ అక్కడనుంచి ఇక్కడకు ఇక్కనుంచి అక్కడకు పరుగులెత్తే వాడు. వికారంగా మూల్గేవాడు. ఆ తరువాత వాడిని బ్రతిమాలి, స్నానం చేయించేప్పటికి ఆ తల్లి ప్రాణం నిస్త్రాణగా స్రొమ్మసిలి పోయేది. అనవసరంగా అర్థరహితంగా బాధల్ని కొనితెచ్చి పెట్టుకుంటున్నావోయ్... గిరీ... నీవు చేసిన పనికి పాపం నీకళ్లు శిక్ష అనుభవిస్తున్నాయ్ చూడు; అని ఎవ్వరో చెప్తున్నట్లుగా, వాడి ఎఱ్ఱబడిన కళ్ళనుంచి వాడి ఇష్టంతో ప్రమేయం లేకుండానే కన్నీళ్లు కారేవి!

తండ్రి మోహనరావు, గిరివిషయమై ఎప్పుడూఅంతగా పట్టించుకోలేదు. వాడు సెకండు ఫారములోకి వచ్చేంత వరకూ అతను కళ్లు తెరవలేదు. కొడుకు బాగానే చదువుకుంటున్నాడని అతని ఉద్దేశం. దానికి తగ్గట్టుగా అప్పుడప్పుడు వాడి మార్కులు పరీక్షించేవాడు. వాటికేం; అవి నిక్షేపంలా ఉండేవి. అన్నింటిలోనూ యాభై మార్కులకు పైనే కనిపించేవి. ఫరవాలేదు చురుకైనవాడు అనుకునేవాడు. ఇక వాడి తల్లి వాడి చిలిపిచేష్టలు, ఉడుకుబోతు

గుణాలు, వాడి మంకు పట్టులు, ఎప్పుడూ మోహనరావు చెవిని వేసేదికాదు. గిరికూడ తండ్రి ముందు అల్లరిచేయడం గాని, కనీసం తండ్రికి తెలిసిన వారిముందు అట్లాంటి పనులు చెయ్యడం కాని సాధ్యమైనంతవరకు చేసేవాడుకాదు. తండ్రంటే ఎంతో భయపడి పోతూన్నట్లు నటించేవాడు. అది చూసి తండ్రి సంతోషించేవాడు. వాడు తనకలా భయ పడుతున్నాడు కాబట్టే, అంత బాగా చదువుతున్నాడు అను కున్నాడు. తనంటే వాడికా మాత్రం భయం ఉండడం మంచిదను కున్నాడు, అట్లాంటి భయంతో వాడ్ని ఉంచగలిగి నందులకు తనను తనే అభినందించు కున్నాడు. 'పిల్లలకు భయం లేకపోతే చెడిపోవడమన్నది ఖాయం వాళ్లు సరియైన దారిని పడాలంటే ఎవరో ఒకరియందు వారికి భయభక్తులుం డడం అవసరం' అని ఊహించేవాడు. కాని గిరికి నిజంగా తనయందు భయభక్తు లున్నవా అని అత నెప్పుడూ పరీక్షించి చూసుకోలేదు. ఏపొరపాటైతే అతను ఇంతకాలం వరకూ చేస్తూ వచ్చాడో, ఇప్పుడు ఆపొరపాటుకతను శిక్ష అనుభవించ డానికి పాపం... తల వంచవలసి వచ్చింది.

సెకండు ఫారంలో వాడి క్వార్టర్లీ ఎగ్జామినేషన్ మార్కులు బాగానే ఉన్నాయి. కాని ఆ తరువాత జరిగిన పరీక్షలో వచ్చిన మార్కులు చూడటానికే అసహ్యంగా ఉన్నాయి. మొదటి పరీక్షలో లెక్కల్లో 70 మార్కులైతే, ఇప్పుడు పది. తెలుగులో అప్పుడు 65 అయితే ఇప్పుడు 14

ఇలాగే మిగిలినవన్నీ వచ్చాయి. ఆ ప్రోగ్రెస్ రిపోర్టు చూసే టప్పటికి అతనిగుండె గబగబా కొట్టుకుంది.

గిరి చదివే మిడిల్‌స్కూలు హెడ్‌మాష్టరు చాల మంచివాడు. ఆయన అభివృద్ధిలోకి వచ్చే విద్యార్థులు చెడి పోతున్నారంటే...ఎంతో బాధపడతాడు. గిరికి మార్కులు సరిగా రాక పోయేప్పటికి, ఆయన ప్రోగ్రెస్ రిపోర్టు వాడి చేతికివ్వకుండా వాళ్ళ నాన్నగారికి పోష్టులో పంపాడు. లేక పోతే అది మోహనరావు చేతిలో పడకపోయేదే! వెంటనే అతను గట్టిగా 'గిరీ...'అని అరచాడు. కాని వాడు ఇంట్లో ఉంటేగా... అతని కొక్కసారిగా శివమెత్తినట్లయింది. 'ఏడీ వాడు...' అంటూ భార్యను అతను విపరీతమైన కోపంతో ఆమె హడలి పోయేంతగా ప్రశ్నించాడు. ఆమె, 'ఏమిటండీ... ఏమిటి... ఏమయింది... ఎందుకంత కోపంగా ఉన్నారు' అంది. ఏమీ తెలుసుకోలేని అశక్త తతో. మోహనరావు మరింత రెచ్చిపోయాడు. చూడు... మీ అబ్బాయిగారి ప్రతాపం, అంటూ మొగం చించుకొని ఎంతో అసహ్యాన్ని కళ్ళల్లో తొణికిస్తూ, ఆ మార్కుల కాగి తాన్ని ఆమె మొగం మీదపెట్టి, 'అన్నింటిలోనూ సున్న లొచ్చాయి అబ్బాయిగార్కి' అన్నాడు.

కాంతమ్మ తెల్లబోయింది. ఆమె, నవనాడులూ కృంగి పోయాయి. ఆమెకు ఆమాట వినగానే పిడుగు పడ్డట్లయింది. వాడు చేసే దుండగాలు భర్త కిప్పుడెలాగూ చెప్పలేని

చిక్కులో ఇరుక్కుంది. చెప్పితే ఒకతప్పు చెప్పక పోతే ఒక తప్పు అనుకుంది. తనే వాడ్ని చేతులారా పాడు చేశానేమో అని కలవరపడింది. కాని ఆసంగతు లేవీ పైకి చెప్పలేక పోయింది. మెల్లిగా, ఎందుకలా వచ్చాయో వాడ్నే అడగండి... నాకు చెప్పుతారేం... నేను గాని చదువుతానా ఏం... అయినా కాని; వాడి గొడవ మీకేనాడు పట్టింది లెండి; ఎప్పుడు చూసినా మీకు, మీస్నేహితులతోనే సరిపోతోంది. ఒక్కనాడైనా వాడెలాచదువుతూందీ పరీక్షించారా...ఏం...'అంటూ అతని నెత్తినే ఆ నేపమంతా రుద్దింది.

మోహనరావుకు మతిపోయింది. అయితే ఇదంతా తన తప్పేనన్నమాట అనుకున్నాడు. అలాగే కుర్చీలో కూలబడిపోయాడు.

భోజనానికి వేళయింది కాబోలు గిరి ఎక్కడెక్కడో తిరిగి అప్పుడే ఇంటికిచేరాడు. వాడ్ని చూడగానే మోహనరావుకు విపరీతమైన కోపం ముంచుకొచ్చింది. కాని అంతలోనే, 'పిల్లల్ని దండించగూడదు. మెల్లిగాచెప్పి సరియైన దారిలోపెట్టాలి. వాడు తెలివైనవాడు జాగ్రత్తగా చదివేట్టు చేస్తే చాలు' అనుకున్నాడు. అలా అనుకొని, 'గిరీ...ఒక సారిటురా...' అని మెల్లిగావాడ్ని పిలిచాడు. తెచ్చి పెట్టుకున్న శాంతం అతని మొగంలో పుటుక్కున ఎప్పుడైనా

తెగి జారిపోవచ్చునన్నట్లుగా వ్రేలాడుతూంది. అతని కళ్లల్లో ఇంకా ఏదో ఆవేదన కొట్టుమిట్టాడుతూంది.

గిరి తండ్రిదగ్గరకు వచ్చాడు. 'ఏమండీ...' అన్నాడు.

మోహనరావు నేపర్లిచ్చినట్లున్నారు. 'మార్కులు చెప్పలేదేంరా' అనబోయి 'అహఁ...అలాకాదు' అనుకొని 'పేపర్లిచ్చార్రా?' అన్నాడు.

గిరి కాళ్లల్లో బలం తగ్గింది. నీరసంగా తండ్రివైపు చూస్తూ, అక్కడ ఏమేమిటో వెదుకుతూ, తండ్రిని మించిన మేధావిలా 'ఇచ్చారండి' అన్నాడు.

మోహనరావు చాలా సంతోషించాడు. 'మనవాడెప్పుడూ అబద్ధం చెప్పడు. తక్కువ మార్కు లొచ్చాయని కొంచెం సిగ్గుపడి ఉంటాడు అనుకున్నాడు. వెంటనే మెల్లగా 'ఎలా వచ్చాయిరా మార్కులు?' అన్నాడు.

ఈసారి గిరి కళ్లల్లో కళవళపాటు వ్యక్తమయింది. కాని తమాయించుకున్నాడు. 'మునుపుకన్న కొంచెం తక్కువ వచ్చాయండి' అన్నాడు.

మోహనరావు గుండె కొట్టుకుంది. లెక్కల్లో ఎన్ని...? అన్నాడు. వెంటనే అప్పుడు అతని పెదవికొద్దిగా చలించింది. కనుకొనల్లో కోపం ముందుకు రావడానికి సిద్ధపడింది.

'లెక్కల్లోనా అండి...మరండి...క్రితంసారి 70 వచ్చాయండి...ఈసారి...ఈసారి...56 మార్కులే వచ్చాయండి...' అన్నాడు.

మోహనరావు కాళ్లక్రింద భూమి కదిలింది. 'మరి... తెలుగులో...' అతని కంఠం అప్పుడే కర్కశంగా మారిపో తూంది.

'తెలుగులోనా అండి...బాగానే వచ్చాయండి, 64 మార్కులొచ్చాయండి'

మోహనరావిక ఉండబట్ట లేక పోయాడు. 'వెధవ లేవు...ఇన్ని పచ్చి అబద్ధాలటరా...' అని చర్రున లాగి ఒక్క లెంపకాయ కొట్టాడు. ఆ లెంపకాయతో గిరి కున్న తెలివంతా ఊడి పడిపోయింది. వాడు మరింత ఊబిలో దిగబడ్డాడు. 'నిజంగా నేనండి' అన్నాడు. కావలిస్తే పేపర్లు చూపిస్తానండి అన్నాడు తొణక్కుండా బెణక్కుండా.

మోహనరావు గుండె దహించుకపోయింది.' ఏది... ఇలా తీసుకురా...' అన్నాడు.

ఆ పేపర్లలో నిజంగా వాడు చెప్పినన్ని మార్కు లేఉన్నాయి కాని వాటిమీద వాడి స్వహస్తం అతి చాకచక్యంతో పని చేసింది. ఇక మోహనరావు కోపాన్ని ఆపుకోలేకపోయాడు. 'ఇదట్రా వెధవా...నువ్వు చేసేది...' అంటూ వాడ్ని తెగ బాదేశాడు; 'ఇలాంటి పచ్చిఅబద్ధా లెప్పుడూ ఆడవుకదా... ఇలాంటి మోసాలు, ఫోర్జరీలు ఎప్పుడూ చెయ్యవుకదా...' అంటూ.

ఆ రాత్రి మోహనరావుకు నిద్రపట్టలేదు. వీడికసలు ఇంత తక్కువగా మార్కు లెందుకొచ్చాయి? వీడు ఎవరెవ

రితో స్నేహం చేస్తున్నాడు? ఎక్కడెక్కడికి తిరుగుతున్నాడు స్కూలుకు సరిగా వెళుతున్నాడా లేదా? ఇలాంటి విషయాలమీద అనేక అనుమానాలొచ్చాయి. అతను ఒక్కసారిగా భయపడిపోయాడు. అసలు కుర్రవాడికిచదువు అబ్బకపోయినా క్రమశిక్షణ అలవడినా చాలు అనుకున్నాడు. వేళకి బడికి వెళ్ళడం, వేళకి ఇంటికిరావడం, తోడిపిల్లలతో సఖ్యతతో ఉండడం, చెడుఅలవాట్లకు లోనుగాకుండాఉండడం ఇలాంటివి అబ్బినాచాలు అనుకున్నాడు. 'అసలు ఇవే అబ్బితే ఇంక కావలసిందేముంది' అనుకున్నాడు.

ఆనాటినుంచీ మోహనరావు వీలు చిక్కినప్పుడల్లా బడికి రోజూ హాజరు కావడంవల్ల వచ్చేలాభాలేమిటో, మంచివాళ్ళతో స్నేహం చేయడంవల్ల ఎన్ని సుఖాలు, సదుపాయాలున్నవో, పరీక్షలు ఫేలవడంవల్ల తల్లి దండ్రులను కష్టపెట్టడమే కాకుండా తనతోటి మిత్రులముందు తలఎత్త లేని అధమాధమస్థితి వాడికెట్లా దాపురిస్తుందో అన్నీ విపులంగా చక్కగా చెప్పేవాడు.

'ఒరే నువ్వు పరీక్ష తప్పిపోయావంటే...నీకు సరేసరి ...మరి నా సంగతికూడా గుర్తించుకో...ఫలానా వారి అబ్బాయి ఫేలయ్యాడంటే నాకెంత తలవంపో ఆలోచించు నా స్నేహితులముందు నేను తలఎత్తగలనా... కనీసం నువ్వు నన్ను రక్షించడం కోసమైనా బాగా చదవాలి...నా కోసం నువ్వు ఆ మాత్రం త్యాగం చెయ్యాలి. అనేవాడు. ఆ

తరువాత మెల్లిగా అతనే, 'నువ్వు చదువుకన్నా ముఖ్యంగా గమనించవలసినవికొన్ని ఉన్నాయి తెలుసా...ఇంటికి వచ్చిన వాళ్ళను నువ్వు సరిగా గౌరవించడం కాని, మర్యాదచెయ్యడం కాని చెయ్యడం లేదని విన్నాను. ఎవరైనా ఇంటికి వస్తే, వాళ్ళనెంతో గౌరవించడం, వాళ్ళముందు వినయవిధేయతలతో మెలగడం, వారి మెప్పుసంపాదించడం ఈమాత్రం కూడ తెలుసుకోకపోతే ఎలా...కుర్రతనంగా, వెకిలితనంగా, వాళ్ళ ముందు ప్రవర్తిస్తే చూడు... ఈఇంట్లోవాళ్ళ కసలు మర్యాద తెలియదు. ఈ అబ్బాయి పొగరుబోతులా ఉన్నాడు అంటారు. బైటివాళ్ళ కింత తప్పుకనిపిస్తే వాళ్లు దానికంత పెద్ద శిక్ష విధిస్తారు.' అనే వాడు. తిరిగి కాస్సేపాగి, 'మీ అమ్మ మాట నువ్వెప్పుడూ త్రోసెయ్యగూడదు. తల్లికన్నా మంచివాళ్లు ఈ ప్రపంచంలో ఎవ్వరున్నారు? తల్లిదండ్రుల యందు భయభక్తులు, శ్రద్ధలేని పుత్రుడు పుట్టినా, గిట్టినా ఒక్కటే... సరే ఇక నువ్వు వెళ్లు' అనేవాడు.

గిరికి తండ్రి చెపుతూన్న మాటలను తప్పక ఆచరణలో పెట్టాలని అవి వింటూన్నప్పుడు ఎంతో గాఢంగా ఉండేది. ఇక బాగా చదవాలనిపించేది. గోపాలంతో స్నేహం ఇక చెయ్యగూడదు అని నిర్ణయించు కొనేవాడు. అమ్మ మాట ఇక ఎప్పుడూ జవదాట గూడదు అనుకునేవాడు. కాని... కాని...అక్కడనుంచి కదలిపోయిన వెంటనే, తండ్రి

చెప్పినదంతా ఒక్క క్షణంలో గాలికి పోయేది. మళ్లీ మామూలే.

ఈ మధ్య వాడిలో గర్వం. బాగా పెరిగిపోయింది. నాకు మార్కులు సరిగా రాకపోవడానికి కారణం; నేను ఒక్కసారీ పుస్తకం ముట్టుకోక పోవడం వల్లనేకాని...ముట్టుకుంటేనా ఫస్టు మార్కులన్నీ నాకే వస్తాయి. ఆ శ్రీనివాసంగాడిని చూస్తే చెడ్డ అసహ్యం వేస్తుంది. తెగరుబ్బుతాడు. కానైతే ఏమిలాభం ? అత్తెసర మార్కులు తప్పించి ఒక్క పిసరు హెచ్చు రావు అనుకునేవాడు. అబ్బ ఇవ్వాళ బద్ధకంగా ఉంది. రేపు చదువుతాను అనుకునేవాడు. తొమ్మిది కాకముందే గాఢనిద్రలో మునిగిపోయేవాడు.

ఇలా రోజురోజుకూ బద్ధకం పెరిగిపోయి అతని చదువుకోవాలనే కాంక్షను ఊపిరి సలపకుండా త్రొక్కేయడం ఆరంభించింది. ఇప్పుడు వాడికి పుస్తకంమీద కన్ను మోపడం అంటేనే బరువుగా ఉంటోంది. మహారోతగా ఉంటోంది. అక్షరాలను చూస్తూఉంటే పుస్తకాలను చించాలనిపిస్తూంది.

ఇక వాడు తల్లిచెప్పిన చిన్నమెత్తు పనిగూడ చేసేవాడుకాదు. ఇలాంటి విషయాలు మోహనరావుకు చెప్పి, అతన్ని బాధపెట్టడం ఆమె వాంఛించ లేకపోయేది... కాని అప్పుడప్పుడు చెప్పక తప్పడంలేదు. అప్పుడతను తిరిగి తలిదండ్రులమీద కొడుక్కు ఉండవలసిన భక్తి ప్రపత్తులమీద చిన్న ఉపన్యాస మిచ్చేవాడు. మంచిగా మసలుకుంటూ,

ఈ వాడ పిల్లలందరికన్నా మంచివాడ వనిపించుకోవాలి అనేవాడు. బజారుకు వెళ్ళి కూరగాయలు తీసుక రావడం కూడా చేయకపోతే, రేపొద్దున్న పెళ్ళయితే మీా ఆవిడ్ని బజారుకు పంపుతావా?... అనేవాడు. మంచి వస్తువులు తాజా సరుకులు కొనడంలో నేర్పు సంపాదించాలి. పెద్దవాళ్ల మాటలను ఇప్పుడు వ్యతిరేకించి, ఆతరువాత ఎన్నో ఇబ్బందులను పడిన వాళ్ళను నేను ఎందరినో ఎరుగుదును. ఒక విధంగా ఇది వారి చరిత్ర. చరిత్ర నేర్పిన గుణపాఠాలను మనం నేర్చుకోకపోతే... మనంకూడ వాళ్ళలాగే తిరిగి కష్టపడ వలసి వస్తుంది. నువ్వు పెద్దయాక ఇలాంటి కష్టాలలో ఇరుక్కోకుండా ఉండాలంటే ప్రతి చిన్న విషయాన్నీ సునిశితంగా పరిశీలిస్తూ పనిలో పట్టుదల ఓపిక వహించడం అలవాటు చేసుకోవాలి. గాలికి విడిచి పెట్టేసిన వాడిలా తిరిగితే తరువాత నువ్వే దుఃఖపడవలసి వస్తుంది అనేవాడు. కాని ఇంత శాంతంగా మోహనరావు వాడికి ఎప్పుడూ చెప్పలేక పోయేవాడు.

గిరిమాత్రం, తండ్రి శాంతంతో చెప్పినా కోపంతో కసరినా అన్నింటినీ ఒక్కలాగే చూసేవాడు. తండ్రి అలా చెప్పేప్పుడు అతని ముందు తలను వంచేసేవాడు. అంతే.

ఇది ఇలా ఉండగా మోహనరావుకు మరీ చికాకు కలిగించే పనులు గిరి ఎప్పుడూ చేస్తూనే ఉండేవాడు. తల పుట్టలా పెరగనిచ్చేవారు. క్షవరం చేయించుకోవేం అని

చెప్తేగాని వాడికాదృష్టి ఉండేదికాదు. అలా తండ్రి చెప్పిన ప్పుడు, వాడికి తండ్రి మీద చాలకోపం కలిగేది. తనకు తల ఒత్తుగా ఉండడం అంటే ఇష్టం... నాన్నగారి కెందుకు నాగొడవ... అనుకునేవాడు. ఇక పుస్తకాల సంగతి సరే సరి... వాటి రెండువైపుల అట్టలు చిరిగి పోయేవి. ముసలి వాని మొగంమీది ముడతల్లా ఆ పుస్తకాల అంచులు ముడుచుకుపోయేవి. రెండు మూడు రోజుల కొక పెన్సిలు పారేసేవాడు. ఇవ్వాళ కొన్న ఎక్సరసైజు పుస్తకం మరునాడు కనిపించేది కాదు. మోహనరావు ఇలాంటి విషయాలలో జాగ్రత్త, పొదుపు, పరిశుభ్రత ఎంత అవసరమో ఎంతో విపులంగా చెప్పేవాడు. ఇదే చదువు అనేవాడు. కాని ఏమి లాభం... చెప్పి చెప్పి నోరు నొప్పి పెట్టడం మినహా...

ఇలాంటివన్నీ తలచుకుంటూ వుంటే మోహనరావు గుండె బ్రద్దలయ్యేది. కుర్రవాడు బాగుపడే లక్షణాలు నానాటికీ మృగ్యమైపోతున్నాయని మనసులో యమయాతన అనుభవించేవాడు.

గిరి ఎలాగో ఒకలాగ థర్డ్‌ఫారంలో ఓ సంవత్సరం నిద్రపోయి, ఫోర్త్‌ఫారం లోనికి మరొక సంవత్సరానికి మేల్కొన్నాడు. మోహనరావు వాడి చదువు ఇక ఇప్పటి నుంచైనా ఓదారిని పడాలంటే ట్యూషను చెప్పించక తప్ప దనుకున్నాడు. తమ ఇంట్లో భోజనానికి కుదిరి, బి. ఏ. మొదటి సంవత్సరం చదువుతూన్న రామానికి గిరిని అప్ప జెప్పాడు.

రామం ఒక పేదవిద్యార్థి చాల తెలివైనవాడు. ఎంతో అణకువతో ఉండేవాడు. గిరికి చదువు చెప్పడానికి అతను ఎంతో ప్రేమతో అంగీకరించాడు. అది తనవిధిగా భావించాడు. కాని గిరికి రామం అంటే గిట్టేదికాదు. మా ఇంట్లో ఉండి, మాసొమ్ము తింటున్నవాడు, నాకు చెప్పడమా అని వాడికి గుర్రుగా ఉండేది. సరిగా చదవమని అతను ఎంతో పోరుపెట్టినా గిరి ససేమిా వినిపించుకొనే వాడు కాదు. అయ్యో, ఆయన నాకు వీడ్ని అప్పజెప్పాడు. నేను వీరివల్ల ఎంతో లాభాన్ని పొందుతున్నాను. కనీసం వీడ్ని నేను ఈ పరీక్ష ప్యాసయ్యేట్లయినా చేయకపోతే నాబాధ్యత నేను నిర్వర్తించినట్లు గాదు. అని అతను తన మనసులో ఎంతో బాధపడి పోయేవాడు. కాని గిరిని ఏమిా చేయులేని దుర్బలుడై కుమిలి పోయేవాడు. ఒకరోజున గిరి మిాద అతనికెంతో కోపం వచ్చింది. అప్పటికెన్నో సార్లు చెప్పిన పాఠంలో చిన్న ప్రశ్న వేస్తే జవాబు చెప్పలేక పోయాడు. దీనితో అతను గిరి చెంపమిాద ఒక్కటి తగలనిచ్చాడు. గిరి హృదయం బుసలు కొట్టింది. 'నువ్వు నన్ను కొడ్తావటా?' అని అతని మిాద విరుచుక పడాలన్నంత కోపం వచ్చింది. కాని అప్పుడే వాళ్ళ నాన్నగారు అటు వచ్చారు. ఆయన రామానికేమి చెప్పాడోకాని రామం ఆనాటినుంచీ గిరి అంటే అంతశ్రద్ధ వహించడం మానుకున్నాడు.

ఇక ఈ చదువు ఇలా ఉండగా వాడు బడికి సరిగా హాజరు కావడం లేదన్న రిపోర్టులు ఈమధ్య మోహనరావు చెవిలో ఎక్కువగా పడడం మొదలు పెట్టాయి. కొందరి మాష్టర్ల క్లాసుల్లో వాడు ఉండడంలేదని విన్నాడు. ఈ మధ్య ఒక మిత్రుడు కనిపించి 'మీ వాడు మొన్న ముగ్గుర్ని ఎక్కించుకొని సైకిలు తొక్కుతున్నాడండోయ్... నాకు బలేగా మండుకొచ్చింది. మెల్లగా వాడితో 'పద్దారంటే దెబ్బలు తగులుతాయిరా... పోలీసులు చూస్తే పట్టుకుంటారు' అన్నా. కాని వాడు వినిపించుకుంటేగా... 'పట్టుకుంటే పట్టుకుంటారు. నీ కెందుకూ' అంటూ తోసుక పోయాడు అన్నాడు. ఈమాట వినగానే, మోహనరావు గుండెనిండా చీకటి అలుముకుంది. 'అవిధేయత... అవిధేయత...' అన్న బాధ అతని గుండెల్లో ఘూర్ణిల్లింది, ఆవేళ అతను గిరిని చితగ్గొట్టాడు, కాని ఏమిలాభం...? కొట్టడంవల్ల ఏమిటి ఫలితం ?

మోహనరావుకు గిరి విషయమై అంత కంతకూ మతి పోతోంది. వాడు ఏమిచేస్తే మారుతాడో, ఏమిచేస్తే వాడికి సరియైన గుణాలు అలవడతాయో .. అర్థంకాలేదు. వాడికి తిండిపెట్టి, చక్కని దుస్తులు కట్టించి, బడికి పంపి, ట్యూషను చెప్పిస్తూ బోలెడంత డబ్బు వృథాగా పోస్తూ వున్నా వాడికి చదువు రాకపోవడం అటుంచి, దుష్ట గుణాలు పెరిగి పోతూండడం అతను సహించ లేక పోయాడు. కాని ఏమిచేస్తే వాడు బాగుపడతాడో అందుకు సరియైన

మార్గమేమిటో అతనికి తోచలేదు. ఇక్కడనుంచి వాడ్ని ఎక్కడికైనా దూరంగా పంపించేసి, ఇక్కడి వాతావరణం నుంచి తప్పించడం మినహా. . . మరొక మంచిమార్గం అతని కేమీ కన్పించలేదు. కాని ఈ చర్యకు గిరితల్లి ఏమిటో పిచ్చిగా ఇష్టపడడంలేదు.

ఇక గిరి పెన్ను పోయిందని, పుస్తకం పోయిందని, ఏదోవంకపెట్టి రోజూ తల్లి దగ్గర ఏదోవిధంగా డబ్బులు పడుకు్కపోతూనే ఉన్నాడు. ఈమధ్య కాంతమ్మ వాడికి డబ్బులిస్తున్న సంగతి. మోహనరావు చెవిని వేస్తోంది. తన బాధ్యతనుంచి ఆవిధంగా విముక్తురాలౌతూంది. కాని పాపం మోహనరావు వాడ్ని ఏవిధంగానూ శిక్షించలేని అసమర్థ తతో కుమిలిపోతున్నాడు. వాడ్ని కొడితే లాభంలేదు. మెత్తగా చెప్పినా వినేట్టులేదు. చివరికి వాడు తనకు శత్రువు కాని శత్రువుగా పరిణమిస్తున్నాడా ఏమిటని అతను లోలోన ఏదో తెలియరాని వ్యథతో కృంగిపోతున్నాడు.

మొన్నటికి మొన్న మోహనరావు ఉంగరం కనిపించ లేదు. ఎవరైనా తీసేరేమోనని ఇంట్లో అడిగాడు. ఎవరూ తియ్యలేదన్నారు. కాని ఎక్కడ వెదికినా అది కనబడలేదు. ఎడమచేత్తో ఎక్కడ పెట్టేశానో అనుకున్నాడు. ఈ భావా నికి తనలో తనే నవ్వుకున్నాడు. తిరిగి అన్నిమూలలా వెది కాడు. కాని అది దొరకలేదు. ఇంతలో అతనికి రాత్రి బీరు వాలో పెట్టినసంగతి గుర్తుకొచ్చింది. అక్కడచూస్తే ఉంగ

రం నిక్షేపంలా ఉంది. ఉంగరం దొరికిందని భార్యకు చెప్ప డానికి వంటవసారా వైపు అతను వెళ్ళబోయాడు. అప్పుడే అక్కడ గిరి తల్లితో ఏమిటో అంటున్నాడు. మోహనరావు కాళ్లు ఆగిపోయాయి. 'ఇదే నేనైతేనా. . . ఈపాటికి చిద గ్గొట్టేసేవారు. అంతేలే. . . పెద్దవాళ్లేమిచేసినా ఫరవాలేదు. నేను దమ్మిడీ చేసేది పారేస్తే, లక్షలుపోయినట్లు ఏడుస్తారు' అన్నాడు. మోహనరావు ఒక్కసారిగా స్తబ్ధుడైపోయాడు. నిలువునా నీరైపోయాడు. అతని అడుగులు మరి ముందుకు సాగలేదు. అతనికి భవిష్యత్తంతా మహాభయంకరంగా కని పించింది. ముందుముందు వీడితో ఎన్నికష్టాలు పడాలో అని మనసులో వణికిపోయాడు. ఎలా వీడిని దారిలో పెట్టడం ఎలా. . . అని వాపోయాడు.

బీడీలు, సిగరెట్లు కాలుస్తున్నాడని ఈమధ్య కొంత మంది కుర్రాళ్లు మోహనరావు చెవిలో వేశారు. ఈ విష యమై గిరిని ప్రశ్నిస్తే తప్పకుండా అబద్ధం చెపుతాడు. కాని అడక్కపోతే ఇది అలవాటై పోవచ్చు. అయినా, మానేస్తా నని తనఎదుట చెప్పినంత మాత్రాన నిజంగా మానేస్తా డని ఋజువు ఏమిటి. . . అయితే వాడు పాడైపోతూంటే చూస్తూ ఊరుకోవడమేనా. . . పాపం మోహనరావు, 'సరే ఎప్పుడైనా వాడు నాకంట బడకపోతాడా ఏం. . . అప్పుడు చెప్తాను బుద్ధి' అనుకున్నాడు.

మంచి పిల్లలు కానట్టి, గోపాలంతోనూ... సత్యంతోనూ, తిరగొద్దని, మోహనరావు గిరికి ఎన్నోసార్లు చెప్పాడు. కాని ఏమిలాభం? వాడ్ని రోజూ అంటి పెట్టుకొని తను ఎక్కడ కాపలా కాయగలడు. సమస్తమూ ఇంట్లో సర్వసమృద్ధిగా దొరుకుతున్నా... వాడు ఇలా పాడైపోతున్నాడు. పైగా ఇంట్లో వాళ్ళంతా శత్రువులైనట్లు మసలుతున్నాడు.

ఆరోజు సాయంత్రం మోహనరావు సైకిలుమీద ఇంటికి వెళ్తున్నాడు. ఆసమయంలో గిరి చదువుతున్న స్కూల్లోని మాష్టారు దారిలో మోహనరావును ఆపి, 'మీవాడు ఏమిచేశాడో తెలుసా..' అన్నాడు. మోహనరావు ఏమి వినవలసి వస్తుందో అని హడలిపోయాడు. 'అక్కడ ఎవడో పాపం సారాబట్టీ పెట్టుకుంటే... ఇంతలేడు, వీడికెందుకు చెప్పండి... మ్యాపుతోసహా అతను ఎక్కడ సారాబుడ్లు దాచాడో చిత్రించి, ముఖ్యమంత్రికి పంపేడట. వెంటనే సి. ఐ. డీలువచ్చి మీవాడు చెప్పినచోట వెతగ్గా—పూర్ ఫెలో పాపం వాడి బ్రతుకు బయటపడింది. వాడు నెత్తీ నోరూ కొట్టుకొని లబో లబో మని ఏడ్చాడు. వచ్చే ఆదివారం మీవాడికి స్వయంగా కలెక్టరు, ప్రభుత్వం తరఫున చిన్న మెడలొకటి ప్రెజెంట్ చేస్తాడట. రేపో

ఎల్లుండో మీకు ఆహ్వానం వస్తుంది. నిక్షేపంలా చదువుకోక ఎందుకండీ మీ వాడికిలాంటి పనులు—' అంటూ అతను వెళ్ళిపోయాడు. పాపం మోహనరావు పూర్తిగా మూగ వాడై పోయాడు. కొడుకు బాగుపడుతున్నాడో లేక చెడిపో తున్నాడో అతని కర్థంకాలేదు. ఒకందుకు తన మనసువాడ్ని మెచ్చుకుంటోంది. కాని మరొకందుకు ఎంతో బాధపడి పోతూంది.

అప్పటికి చీకటిపడింది. వీధిలోని విద్యుద్దీపాలు గాలికి ఆరిపోని కిరసనాయిలు బుడ్లలా వెలుగుతున్నాయి. దీపం ఉన్నచోట ఇంతకాంతి మచ్చలా పడుతూంది. కొంతదూరా నికది పల్చబడి, ఆతరువాత దీపపుకాంతిలో కలసి పోతూంది. పొడుగైన నీడలు పొట్టివౌతూ, పొట్టివైన నీడలు పొడు గౌతూ ఉన్నాయి.

మోహనరావు మనసు నీరసంగా ఆలోచిస్తోంది. అప్పుడే అతనికి ఆ పైన ఉన్న విద్యుత్ స్తంభందగ్గర, ముగ్గురు కుర్రాళ్లు కనిపించారు. వారిలో గిరి ఉన్నట్టు అతను ఆనవాలు పట్టాడు. ఇంతలోనే వారికి సమీపంగా అతని సైకిలు వచ్చింది.

గిరి, సుతారంగా సిగరెట్టు కాలుస్తూ నడుస్తున్నాడు. అప్పుడు వాడి మిత్రుడొకడు వాడితో, 'చాటుగుండా ఏదో ఉత్తరం గిలికి పారెయ్యడం మహాధైర్య మనుకుంటున్నావు కాబోలు—ఇప్పుడు మీనాన్నగారు చూడాలి. వెల్లడౌ తుంది నీ ధైర్యం—, అన్నాడు.

వెంటనే గిరి, తడుముకోకుండా, 'ఏడిశాడు— మనకేవడైతే లెక్కోయ్... మనం ఎవరికీ భయపడం తెలుసా' అన్నాడు.

మోహనరావు ఒక్కసారిగా భూమిలోకి కృంగిపోయాడు. అతని సైకిలు నడుస్తోంది, కాదు...కాదు... పాతాళానికి దిగబడి పోతోంది. 'ఇలాంటివాడా నా కొడుకు, ఇలాంటివాడా నా కొడుకు' అని అతని ఎద కొట్టుకుంది. ఇంత దుఃఖాన్ని పాప మతను ఇంతకు ముందు ఒకే ఒక్కసారి అనుభవించాడు. ఆనాడు అహింసావ్రతుణ్ణి, లోకోత్తర పురుషుణ్ణి, ఒక దుర్బలుడైన, అసమర్థుడైన, పుత్రసమానుడు దారుణంగా చంపేశాడు. అబ్బ! అది తలచుకోలేం... ఎంత దారుణం! ఎంత దారుణం! తిరిగి అంత దుఃఖం అతని కీనాడు కలిగింది. అది అతని గుండెల్ని పిశాచంలా పీక్కుతింటోంది. 'నాకు చావు ఎందుకు రాదు... నాకు చావు ఎందుకు రాదు... నేనీబాధ సహించలేను... నేనీబాధ సహించలేను' అని ఇంకా ఏమేమిటో అనుకొని ఛిన్నాభిన్నమైపోతూన్న అతన్ని, పాపం ఆనాడు ఆ సైకిలే ఇంటికి చేరవేసింది.

గిరి స్నేహితుడు, గోపాలం, 'ఒరే— మీ నాన్నలా ఉన్నాడురా... ఆ సైకిలు మీద చూడు' అన్నాడు. గిరి ఒక్కసారిగా తబ్బిబ్బైపోయాడు. 'మా నాన్నేరా... మా నాన్నే... నేనన్న మాటలు వినిపించే ఉంటాయి...

ఎలారా నేను సిగరెట్టు కాల్చడం చూసే ఉంటారు... ఎలా' అంటూ భయకంపితుడై పోయాడు. వెంటనే సత్యం, 'చూసి ఉండరురా... చూస్తే ఇక్కడే నిన్ను తన్నేవారు ఏదో ఆయన ఆలోచనల్లో పరధ్యానంగా ఉండి ఉంటారు' అని వాడికి నచ్చజెప్పాడు.

ఆ రాత్రి బితుకు బితుకు మంటూనే గిరి గుమ్మంలో అడుగు పెట్టాడు. ఇంట్లో అంతా నిశ్శబ్దంగా ఉంది. రోజూ మ్రోగే రేడియో పలకడం లేదు. అక్కడనే ఏదో పుస్తకం చదువుకుంటూ కూర్చునే నాన్నగారు అక్కడ లేరు. దిగాలుగా గిరి లోనికి అడుగు పెట్టాడు. దొంగలా ఇంట్లో ప్రవేశిస్తున్నందులకు బాధపడి పోయాడు. తల్లి ఏమీ మాట్లాడకుండానే నీళ్ళు పెట్టింది. త్వరత్వరగా స్నానం చేసేశాడు. ఇన్ని మెతుకులు నోట్లో వేసుకొని బయటకు పారిపోవాలని అనుకున్నాడు. అప్పుడుకాని మనస్సుకు శాంతి లభించదని ఆతృత పడ్డాడు. కాని భోజనం దగ్గర కొచ్చేప్పటికి అక్కడ నాన్నగారికీ తనకూ ఒకచోట వడ్డించడం చూశాడు. ఈమధ్య కాలంలో తను ఎప్పుడూ నాన్నగారితో కలసి భోజనం చేయ లేదు.

గిరికి మూర్ఛ వచ్చినంత పని అయింది. అక్కడకు వెళ్ళి కూర్చునేప్పుడు ఎమిటో వాడి కాళ్ళు తడబడ్డాయి. ఒక కాలు అక్కడ ఉన్న మంచినీళ్ళ గ్లాసును తన్నేసింది. గ్లాసులో ఉండగా త్రాగటానికి ఉపయోగపడే నీరు ఎం

దుకూ కొరగాకుండా వృథాగా గచ్చుమీద ప్రాకుతూంది. నీళ్ళు ఒలికిపోయినందుకు మోహనరావు ఏమీ అనలేదు. ఏమీ అనకపోవడంతో గిరి మరింత దిగజారిపోయాడు. అతని గుండెల్ని అతను పట్టుకో లేక పోతున్నాడు. దుర్భరమైన ఆ ఆవేదన భరించ లేకపోతున్నాడు. అన్నం తినాలి కాబట్టి తింటున్నాడు. 'ఇకముందు ఏమి జరుగుతుంది...ఇకముందు ఏమి జరుగుతుంది...' అని అతని హృదయం దిగ్గుదిగ్గున ఒకటే ప్రశ్నిస్తోంది.

భోజనం అయింది. అంతా అయోమయంగా ఉంది. చేతులు కడుగుకుంటూ ఉండగా, 'ఇటురా...' అంటూ మోహనరావు ముందుకు సాగిపోయాడు. గిరి తండ్రిని అనుసరించక తప్పలేదు. అప్పుడే ఎవరో సన్నగా ఆ చివరి గది లోంచి ఏడుస్తూండడం వినిపించింది. గిరి పైప్రాణం పైనే పోయింది. తుఫానులో చిక్కుకున్న పులుగులా, బెంబేలు పడిపోయాడు. మోహనరావు. 'ఇలా కూర్చో...' అన్నాడు. మెల్లగా గిరి బల్లమీద కూర్చున్నాడు. తండ్రి డ్రాయరు సొరుగు తీశాడు. అందులో ఏదైన రివాల్వరు ఉండి, దానితో తండ్రి తనను చంపేసినా బాగుండు ననుకున్నాడు. వాడు తండ్రివైపు చూడలేక పోయాడు. అప్పుడే మోహనరావు, మెల్లగా వాడిముందు, ఒక సిగరెట్టుపెట్టే, ఒక అగ్గిపెట్టే ఉంచాడు. పెదవులు విప్పి, 'నీయిష్టంవచ్చినట్లు కాల్చుకో...

నాముందు కాల్చినా నేనేమీ అనుకోను. ఇంతమాత్రానికే అవిధేయతగా ఉండడం దేనికి?' అన్నాడు.

అంతే...

గిరి ఒక్కసారిగా కుమిలిపోయాడు. తండ్రికి ఏమేమిటో చెప్పా లనుకున్నాడు. పశ్చాత్తాపముతో కృంగిపోతున్నానని చెప్పబోయాడు. తనకీ ప్రాయశ్చిత్తము చాలదు అనబోయాడు. కాని...కాని...పాపం ఏమీ చెప్పలేక పోయాడు. అక్కడ ఒక్కక్షణం కూడా ఉండలేక పోయాడు. అంతే. అదేపోతగా అక్కడనుంచి ఒకటే పరుగు పుచ్చుకున్నాడు. 'గిరీ...గిరీ...' అని తండ్రి పిలుస్తున్నా వినిపించుకో లేదు. 'నాయనా...నాయనా...ఎక్కడికి ఈ రాత్రివేళ...' అని తల్లి ఎంత రోదిస్తున్నా వాడు వెనక్కు తిరగలేదు.

పాపం! ఆ తలిదండ్రులు...అప్పటినుంచీ గిరికోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ఎప్పటికైనా గిరి ఇంటికి వస్తా డనే పాపం వారి ఆశ!

— జాగృతి 9–12–55.